క్లుప్తంగా

అనధికార వెంచర్లు వేస్తే కఠిన చర్యలు



లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన వీఆర్‌ఓ

సింగరాయకొండ: మండలంలో అనధికార వెంచర్లు వేసిన వారిపై కఠినచర్యలు తప్పవని ఇన్‌చార్జి తహశీల్దార్ పుల్లారావు రియల్టర్లను హెచ్చరించారు. మండలంలోని శానంపూడి పంచాయతీ సర్వే నంబర్ 483–2, కనుమళ్ల పంచాయతీ సర్వే నంబర్ 329–1,2, 368 లో వేసిన అక్రమ లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్‌ఓలు తిరుమల, పంచాయతీ కార్యదర్శులు సునీత, సాంబశివరావు పాల్గొన్నారు.

6న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

పామూరు: తొలి ఏకాదశి సందర్భంగా పామూరు శ్రీరమాసమేత వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయ కల్యాణ మండపంలో ఈ నెల 6న సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. వ్రతాల్లో పాల్గొనదలచిన వారు పేర్లను నమోదుచేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

చిన్నపాటి వర్షానికే..



చిన్నపాటి వర్షానికే మడుగును తలపిస్తున్న రోడ్డు

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురంలో చిన్నపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలబడి మడుగును తలపిస్తోంది. దీంతో పాదచారులు, ద్విచక్రవాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూరంగా వాహనం వస్తుందంటే మురికినీరు, బురదపైన పడతాయని దూరంగా పోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కోవిలంపాడు నుంచి సీఎస్‌పురంకు వెళ్లేరోడ్డులో పెట్రోల్‌బంక్ సమీపంలో రోడ్డు గుంతలమయంగా ఉంది. తక్షణం సీఎస్‌పురంలోని రోడ్లకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పుల్లారావు



పుల్లారావు

సింగరాయకొండ: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పుల్లారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పొన్నలూరు తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల తహశీల్దార్ టి.రవి ఇక్కడి నుంచి బదిలీపై ఒంగోలు కలెక్టరేట్‌కు వెళ్లారు. గతంలో ఈయన డిప్యూటీ తహశీల్దార్‌గా మండలంలో పనిచేసిన అనుభవం ఉంది.

ఆ మండలాలను కందుకూరులో కలపాలి

కందుకూరు: కందుకూరు కోర్టు పరిధి నుంచి మినహాయించిన మూడు మండలాలను తిరిగి కందుకూరు కోర్టు పరిధిలోకి చేర్చేందుకు న్యాయాధికారులు చర్యలు తీసుకోవాలని కందుకూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్‌నాయుడు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రధానంగా కేసుల సత్వర పరిష్కారం కోసం ఇటీవల సింగరాయకొండలో కోర్టును ఏర్పాటు చేశారు. కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు మండలాలను కందుకూరు కోర్టు నుంచి సింగరాయకొండ కోర్టు పరిధిలో చేర్చారు. దీని వల్ల సింగరాయకొండ కోర్టుపై పనిభారం పెరిగి కక్షిదారులకు సత్వర న్యాయం జరిగే అవకాశం లేకుండా పోయిందన్నారు. అదే సందర్భంలో కందుకూరులో ఉన్న రెండు కోర్టుల పరిధిలో కేసుల సంఖ్య తగ్గిందన్నారు. కావున కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాలను తిరిగి కందుకూరు కోర్టు పరిధిలోకి తీసుకురావాలని తీర్మానించారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్ డే వేడుకలు

కందుకూరు: బైక్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మెకానిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని షాదీఖానాలో జరిగిన వేడుకల్లో పలు సీనియర్ మెకానిక్‌లు, మెకానిక్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సేవలను, సమస్యలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మెకానిక్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మెకానిక్‌ల కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కందుకూరు పట్టణంలో యూనియన్ కోసం ఓ స్థలాన్ని కేటాయించడంతో పాటు, పనిముట్లు కొనుగోలు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. అమర్‌రాజా బ్యాటరీస్ డిస్ట్రిబ్యూటర్ నరేంద్ర రూ.20 వేల చెక్కును మెకానిక్ సంక్షేమం కోసం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ మెకానిక్‌లు రహమాన్, ఆంజనేయులు, సీపీఐ నాయకులు వీరారెడ్డి, యూనియన్ ప్రెసిడెంట్ జిలాని, ఖాదర్‌బాషా, నజీర్, కోటి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ఆర్టీసీ సేవలు..

ప్రజలకు తప్పని ఇక్కట్లు



బస్ సౌకర్యం లేకపోవడంతో ఆటోలో ప్రయాణం చేస్తున్న రావులకొల్లు గ్రామస్తులు



బస్ సర్వీసు లేక సైకిళ్లపై స్కూల్‌కి వెళ్తున్న విద్యార్థినులు

- రావులకొల్లు, ఉప్పలదిన్నె గ్రామాలకు ఏడాదిగా నిలిచిన ఆర్టీసీ బస్సు సేవలు
- ఇక్కట్లు పడుతున్న గ్రామస్తులు
- మంత్రి స్వామికి విన్నవించినా ఫలితం శూన్యం
- తీవ్ర అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రజలు

పొన్నలూరు:

కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంత ప్రజలు కనీస సౌకర్యాలు లేకా పలు రకాల ఇబ్బందులు గ్రామీణ ప్రాంత ప్రజలకు వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మండలంలోని రావులకొల్లు, ఉప్పలదిన్నె గ్రామాల ప్రజలు ఏడాదిగా బస్సు సౌకర్యం లేకా రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆటోలు వంటి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వాస్తవంగా రావులకొల్లులో సుమారుగా 600 గృహాలతో పాటు 2400 మంది, ఉప్పలదిన్నె గ్రామంలో 300 గృహాలతో పాటు 1100 మంది ఉంటున్నారు. అలాగే ఈ రెండు గ్రామాల నుంచి ప్రజలు పలు రకాల పనులపై మండల కేంద్రమైన పొన్నలూరు, అలాగే కందుకూరు ప్రాంతాలకు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. అయితే ఏడాదిగా ఈ రెండు గ్రామాలకు బస్సు సర్వీస్ నిలిపివేయడంతో ప్రజలు తమ పనులపై ద్విచక్ర వాహనాలు సొంత వాహనాలపై ప్రయాణం చేస్తున్నారు. సొంత వాహనాలు లేని వారు ఆటోలు, ప్రైవేట్ వాహనాలను సంప్రదిస్తున్నారు. గత ఏడాదిలో రెండు గ్రామాల ప్రజలు, విద్యార్థుల అభ్యర్థన మేరకు బస్ సర్వీస్ ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బస్ సర్వీస్ నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

పాఠశాలకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు నడవాలి

రావులకొల్లు, ఉప్పలదిన్నె గ్రామాల్లో సుమారుగా 60 మందికి పైగా ప్రతి రోజూ పొన్నలూరు, కందుకూరు వంటి ప్రాంతాలకు వెళుతూ చదువుకుంటున్నారు. అయితే ఏడాదిగా ఈ రెండు గ్రామాలకు బస్సు సర్వీస్ లేకపోవడంతో పాఠశాలకు వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. కొంత మంది విద్యార్థులను వారి బంధువులు పొన్నలూరు వరకు ద్విచక్ర వాహనాలపై వదిలిపెడుతున్నారు. మరికొందరు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. బస్ సౌకర్యం లేకపోవడంతో ఉప్పదిన్నెకు చెందిన విద్యార్థులు కొందరు పొన్నలూరు వరకు మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ, మరికొందరు సైకిళ్లపై పాఠశాలలకు వెళ్తున్నారు. ఇలా ప్రతి రోజు రెండు గ్రామాల ప్రజలు, విద్యార్థులు బస్ సౌకర్యం లేకా అవస్థలు పడుతున్నారు.

పట్టించుకోని మంత్రి స్వామి....

గ్రామాలకు బస్ సౌకర్యం లేకపోవడం వలన ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్ సర్వీసు ఏర్పాటు చేసి రెండు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రజలు మంత్రి బాలవీరాంజనేయస్వామికి ఏడాది క్రితం విన్నవించారు. అయినా మంత్రి స్వామి పట్టీపట్టనట్లు వ్యవహరిస్తూ నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రెండు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మంత్రి స్వామికి, ఆశాఖ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం శూన్యమని వాపోతున్నారు. కనీసం రోజులో ఉదయం, సాయంత్ర రెండు సర్వీసులు నడిపిస్తే విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లే చదువుకుంటారని రెండు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆ శాఖ అధికారులు స్పందించి రావులకొల్లు, ఉప్పలదిన్నె గ్రామాలకు బస్ సర్వీసు పునరుద్ధరించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు:



ఉప్పలదిన్నె గ్రామానికి గతంలో బస్ సర్వీసు ఉండేది. గత ఏడాదిగా బస్ సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ముఖ్యంగా పాఠశాల, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ప్రయాణ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో కూడా మూడు సార్లు సమస్యను విన్నవించి, ఆశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

మన్నెం పద్మ, సర్పంచ్ ఉప్పలదిన్నె

ప్రజాప్రతినిధులు స్పందించాలి:



గత ఏడాదిగా రావులకొల్లు గ్రామానికి బస్ సర్వీసు లేదు. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామానికి బస్ సర్వీస్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు కూడా విన్నవించనా ఫలితం శూన్యం. ఉదయం, సాయంత్రం బస్ సౌకర్యం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు, గ్రామస్తులకు మేలు జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

పాలడుగు వినోద్‌కుమార్, రావులకొల్లు



ముసలారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆదిమూలపు సురేష్, మాదాసి వెంకయ్య

ముసలారెడ్డి చిత్రపటానికి నివాళులు

మర్రిపూడి: మండలంలోని చిమట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెలుతుర్ల ముసలారెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆయన దశదిన కర్మకు గురువారం మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని ముసలారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుబూతి తెలిపారు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందన్నారు. వారి వెంట సర్పంచ్‌లు పులిచర్ల లక్ష్మమ్మ రామిరెడ్డి, గంగిరెడ్డి రమణారెడ్డి, బొల్లినేని నాగేశ్వరావు, గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, మాకినేని హరీష్, వనిపెంట మల్లికార్జురెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఉప్పలమూరి చెన్నారెడ్డి, జొన్నలగడ్డ సురేష్, లోకయ్యలు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మాధవరావు

పొన్నలూరు: గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వం కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ప్రకారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఆహ్వానించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేయకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు నిలిచి పోతున్నాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, అలాగే పంట నష్టం పరిహారం రైతులకు అందించలేదన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు రూ.10 వేలు లంచం తీసుకొని కొత్తపాలెం గ్రామంలో చామకూరి రామచంద్రారెడ్డి అనే రైతుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రాజోలుపాడు సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి ఆ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, వైస్ ఎంపీపీ అనుమోలు శివయ్య, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించాలని వినతి



ఎంఈఓతో మాట్లాడుతున్న నాయకులు, గ్రామస్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కోవిలంపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించాలని ఎస్‌ఎంసీ చైర్మన్ బాలకాశయ్య, నాయకులు ఎ.బాలకేశవరెడ్డి, గ్రామస్తులు ఎంఈఓ జె.ప్రసాదరావును కోరారు. ఈ సందర్భంగా గురువారం ఎంఈఓకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గతంలో పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు ఉండేవారని, ముగ్గురు బదిలీపై వెళ్లగా ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. తక్షణం ఉపాధ్యాయులను కేటాయించి విద్యార్థులకు విద్య కుంటుపడకుండా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో దొనపాటి మోహన్‌రెడ్డి, పాలపర్తి నారాయణరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం చిన షరిగత్తు వేడుకలు



విద్యుత్ దీప అలంకరణలో పీర్ల చావిడ్లు



మయాన మకాన్‌లో విశిష్ట పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతీకగా, మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం చిన షరిగత్తు వేడుకలు కనిగిరిలో గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం పురస్కరించుకుని పట్టణంలోని మయాన (పఠాన్) మకాన్, సయ్యద్ మకాన్, మంగలి మాన్యం, టకారిపాలెం పీర్ల చావిడ్లు(అషూర ఖాన)లను విద్యుత్ దీప పూల అలంకరణలతో సుందరంగా తీర్చి దిద్దారు. మొహర్రం చిన షరిగత్తు సందర్భంగా సయ్యద్ మకానంలో ఇమామే హసన్, ఇమామే హుస్సేన్ తదితర నామకరణాలు కల్గిన పీర్ల(హజరత్)లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సయ్యద్ మకానంలో ×ఇమామే ఖాశింకు ×సేరా బాంద్‌నా= కార్యకమాన్ని ముజావర్లు అత్యంత నియమ నిష్టలతో జరిపారు. మయాన మకాన్‌లో బారాయిమామ్, పాదిలి సాహెబ్, హసన్, హుస్సేన్ తదితర నామకరణాలు కల్గిన పీర్లకు విశిష్ట పూజలు చేశారు. టకారిపాలెం, మంగలిమాన్యంలో గిద్దలూరి సాహెబ్, ఖాశిం సాహెబ్, హసన్, హుస్సేన్ పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కు బడులు ఉన్నవారు పీర్ల చావిడి వద్దకు వచ్చి నైవేద్యాలు సమర్పించారు. ఆయా పీర్ల చావిడ్ల అగ్ని గుండాలను ఏర్పాటు చేశారు. కుల మత వర్గాలకు అతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో మొహర్రం చిన షరిగత్తు సందర్భంగా పీర్ల గ్రామోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి.

ప్రత్యేక పూజలు చేసిన చైర్మన్ గఫార్

మొహర్రం పీర్ల పండుగ చిన షరిగత్తు సందర్భంగా పట్టణంలోని మయాన మకాన్, సయ్యద్ మకాన్‌లలో ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం, అక్బర్ అలీ, పాదిలి సాహెబ్ వివిధ నామకరణాలు కల్గిన పీర్లకు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సయ్యద్ రిజ్వానా ఖాలక్, దేవరాజ్, పులి శ్రీనివాసులరెడ్డి, పసుపులేటి అరుణోదర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొట్టు శ్రీను, మాజీ కౌన్సిలర్లు సయ్యద్ జిలాని, సయ్యద్ నాయబ్ రసూల్, ముజావర్లు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలల కుదింపుపై ధర్నా



మంగంపల్లిలో ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హనుమంతునిపాడు: నూతన విద్యా విధానంలో భాగంగా పాఠశాలల విలీనం కార్యక్రమాన్ని తక్షణమే ప్రభుత్వం మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. నందనవనం పంచాయతీ పరిధి మంగంపల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థితల్లిదండ్రులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలు, దళితులు నివసించే ప్రాంతాల్లో పాఠశాలలను కుదించడం మంచి పద్ధతి కాదన్నారు. మంగంపల్లి నుంచి నందనవనం ఆదర్శ పాఠశాలకు వెళ్లాలంటే 2 కిలోమీటర్లు వెళ్లాలన్నారు. చెరువు కట్ట మీదుగా చిల్ల చెట్లలో నుంచి పిల్లలు వెళ్లాలంటే ఇబ్బందులు పడతారన్నారు. దళితవాడలోనే పాఠశాల ఉంచాలని ధర్నా చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ సంఘనాయుకులు, గ్రామస్తులు బాలయ్య, కోటయ్య, జక్రయ్య, పురుషోత్తం, గరటయ్య పాల్గొన్నారు.

202 బేళ్లు తిరస్కరణ



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు



టంగుటూరులో పొగాకు వేలం

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 202 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని గుర్రప్పడియ, మూగచింతల, నెన్నూరుపాడు గ్రామాలకు చెందిన రైతులు 893 బేళ్లను వేలానికి తీసుకురాగా 691 బేళ్లను కొనుగోలు చేసి 202 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.246.82గా నమోదైంది. వేలంలో 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 266 పొగాకు బేళ్లు వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఎక్కువగా లోగ్రేడ్ పొగాకు బేళ్లు తిరస్కరణకు గురి కావడం, కనీసం రూ. 160 కూడా లోగ్రేడు పొగాకును కొనుగోలు చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వేలానికి ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం, అనంతవరం గ్రామాలకు చెందిన రైతులు 1044 బేళ్లను తీసుకురాగా 778 బేళ్లను కొనుగోలు చేసి 266 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.232.73గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: స్థానిక పీహెచ్‌సీలో గురువారం గర్భిణులకు ప్రత్యక వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ సందీప్, డాక్టర్ లక్ష్మీ భార్గవిలు 25 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు గోరా బాలుడు, పద్మావతి, ఏఎన్‌ఎంలు, నర్సులు పాల్గొన్నారు. హాజీపురంలో గురువారం 104 వాహనం ద్వారా 54 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.డెంగీ, టైఫాయిడ్, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు ఇచ్చారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

దళితవాడలో డీప్ బోరు ఏర్పాటు

మర్రిపూడి: మర్రిపూడి పాత ఎస్సీ కలనీలో గత కొంత కాలంగా తాగు, వాడుక నీరు అందక దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ కదిరి భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు. పాతపల్లెలో గతంలో ఉన్న డీప్‌బోరు మరమ్మతులకు గురై, శిథిలావస్థకు చేరింది. దళితులు నివేదనకు స్పందించిన సర్పంచ్ భాస్కర్ పాత డీప్ బోర్ స్థానంలో నూతన డీప్ బోరువేసి మినీ ట్యాంక్ నిర్మించి, దానికి కుళాయిలు ఏర్పాటుచేసి తాగు, వాడుక నీరు అందించారు. దీంతో దళితులు హర్షం వ్యక్తం చేశారు.

ముఠా కార్మికులకు నగదు చెల్లింపు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో ముఠా కార్మికులకు రూ.22,48,594 ను ఒకే విడతలో చెల్లించినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. జీఎస్టీ నమోదు జాప్యం కారణంగా 2025 మార్చి నుంచి చెల్లింపులు నిలిచిపోయాయన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో 24 గంటల్లోపు మొత్తం చెల్లింపు విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు రూరల్: కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌కే.నాగూర్‌వలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ, ఎకనామిక్స్ సబ్జెక్టులను బోధించుటకే అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆయా సబ్జెక్టులలో 50 శాతం మార్కులతో ఏదైన యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన బయోడేటాతో ఈ నెల 7వ తేదీన కళాశాలలో హాజరు కావాలని కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న సంజీవరావు

కొండపి: ఆంధ్రప్రదేశ్ ఎల్కక్టిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 గత 75 ఏళ్లగా విద్యుత్ ఉద్యోగుల సేవలో నిమగ్నమైందని ఏపీసీపీడీసీఎల్ యూనిట్ అధ్యక్షుడు రాచగర్ల సంజీవరావు అన్నారు. గురువారం కొండపిలో యూనిట్ అధ్యక్షులు సంజీవరావు,కందుకూరు డివిజన్ కార్యదర్శులు మనోహర్,సెక్షన్ సభ్యుల ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కొండపి బస్టాండ్ నుండి మండల విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం వద్ద జెండా, శిలాఫలకం ఆవిష్కరించారు. కార్మికులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డిస్కం కార్యదర్శి శర్మ ప్రాంతీయ అధ్యక్షుడు హరికృష్ణ, టి.జాన్సన్, జైకర్, ప్రతాప్, సురేష్, మల్లికార్జున్, మనీష్, రవికాంత్, నరసింహారావు,వాహబ్, రవిశంకర్, కాంతారావు, నాగయ్య పాల్గొన్నారు.